## క్లుప్తంగా

### వయో వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలి



పెర్కిట్: వయో వృద్ధులను కుటుంబ సభ్యులు జాగ్రత్తగా చూసుకోవాలని వయో వృద్ధుల హక్కుల పరిరక్షణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మాయవర్ రాజేశ్వర్ అన్నారు. జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్మూర్ మండలం అంకాపూర్ లాలన వృద్ధాశ్రమంలోని వృద్ధులను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళావతి, సూర్యరావు, చెన్నమ్మ, పద్మ, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అవగాహన



రెంజల్: మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులకు గురువారం షీ టీమ్ సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీమ్ ఇన్‌చార్జి ఆశన్న, రెంజల్ ఎస్సై చంద్రమోహన్ మాట్లాడుతూ.. ఆడపిల్లలు సమాజంలో ఎలా ఉండాలో వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి విషయాలను బాలికలకు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పంట నష్ట పరిహారం అందించాలి



రుద్రూర్: భారీ వర్షాల వల్ల దెబ్బ తిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని పొతంగల్ మండల బీజేపీ అధ్యక్షుడు భజరంగ్ హన్మాండ్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు పొతంగల్ తహసీల్ కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకగౌడ్, సాయిలు, ఓమన్న పటేల్, మక్కన్న, పటేల్, విజయ్ కుమార్, మక్కన్న తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలో రెడ్‌కలర్ డే



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని స్మైల్ ద స్కూల్ పాఠశాలలో గురువారం రెడ్ కలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ షబానాగౌహర్ తెలిపారు. అనంతరం విద్యార్థులు ఆట, పాటలతో సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా కృష్ణాష్టమి

బోధన్‌టౌన్: రాకాసీపేట్‌లోని ఇందూర్ ప్రైమరీ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిశోర్‌కుమార్ హాజరై మాట్లాడారు. హెచ్‌ఎం సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గుర్తింపు కార్డుల వితరణ

వేల్పూర్: మండలంలోని పడగల్ ప్రైమరీ స్కూల్‌లో 150 మంది విద్యార్థులకు ఆర్మూర్ రోటరీక్లబ్ సభ్యులు గుర్తింపుకార్డులు, బెల్టులను గురువారం వితరణ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు జక్కుల రాధాకృష్ణ, హెచ్‌ఎం సరోజిని, ఉపాధ్యాయులు శంకర్, రాకేశ్, నాగరాజు, ప్రవీణ్, అజయ్‌కుమార్, రేణుక పాల్గొన్నారు.

### హామీలను అమలు చేయాలి

నందిపేట్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ గురువారం నందిపేట మండలంలోని సీహెచ్ కొండూర్, బాద్గుణ గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయా జీపీ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.గంగాధర్, సుధాకర్, నవీన్, పోసాని, సునీత, నర్సక్క పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు వినతి

రుద్రూర్: కోటగిరి–ఎత్తొండ రహదారి పక్కన నిర్మిస్తున్న రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని బాన్సువాడ సెగ్మెంట్ బీజేపీ నాయకులు కోనేరు శశాంక్, మండల పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కోటగిరి, రుద్రూర్ మండలాల అధ్యక్షులు ఏముల నవీన్, హరికృష్ణ, సీనియర్ నాయకుడు ప్రకాశ్ పటేల్, నాయకులు ఉన్నారు.

### 108 వాహనం తనిఖీ

రెంజల్: రెంజల్‌లోని 108 వాహనాన్ని గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వినయ్‌కుమార్ తనిఖీ చేశారు. మందులు, పరికరాల పనితీరును పరిశీలించారు. అత్యవసర సమయంలో అందించే సేవలను గుర్తించి రోగులకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఈఎంటీ సంజీవ్‌గౌడ్, పైలట్ నయిముద్దీన్‌కు సూచించారు.

# అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులు
- అవస్థలు పడుతున్న చిన్నారులు, గర్భిణులు



రుద్రూర్‌లో అద్దె గదిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



రుద్రూర్‌లో రెండున్నర ఏళ్ల క్రితం పక్కా భవనాన్ని కూల్చి వేసిన స్థలం

రుద్రూర్ : చిన్నారులకు ప్రీ స్కూల్ విద్యను అందించడం, పోషకాహార లోపం లేకుండా చూడడం, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే ప్రధాన లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడంలో, సొంత భవనాలను నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో అద్దె గదుల్లో చిన్నారులు, గర్భిణులు కేంద్రాలకు వచ్చి ఇబ్బంది పడుతున్నారు. జిల్లా లోని బాన్సువాడ సెగ్మెంట్‌లో ఆరు మండలాలు ఉన్నాయి. మోస్రా, రుద్రూర్, వర్ని, కోటగిరి, చందూర్, పొతంగల్ మండలాల్లో 142 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 94 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 30 కేంద్రాలు వివిధ ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల భవనాల్లో, 18 కేంద్రాలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. వర్ని మండలంలో ఏడు, మోస్రాలో ఐదు, రుద్రూర్‌లో రెండు, కోటగిరిలో ఒకటి, పొతంగల్‌లో మూడు కేంద్రాలు అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. వీటిలో సగానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాలకు రెండున్నర ఏళ్ల క్రితం సొంత భవనాలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్ల పనులు ముందుకు సాగడం లేదు.

## భవనాన్ని కూల్చేసి..

రుద్రూర్ మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ సమీపంలో పటిష్టమైన వీడీవో క్వార్టర్‌లో ఒక కేంద్రాన్ని పదేళ్లుగా నిర్వహించారు. ఐతే రెండున్నర ఏళ్ల క్రితం ఎన్‌డీఎఫ్ నిధులతో నూతన భవనం మంజూరైందనే పేరుతో భవనాన్ని కూలగొట్టారు. ఇప్పటికి పనులు మొదలు పెట్టలేదు. దీంతో ఈ కేంద్రాన్ని ఇరుకు గదిలో నిర్వహిస్తున్నారు. టాయిలెట్ సౌకర్యం లేదు. భోజనం చేయడానికి వచ్చే గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. మరో కేంద్రం రేణుకా ఎల్లమ్మ మందిరం సమీపంలోని ఇంట్లో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి స్వంత భవనం లేదు. అంబం(ఆర్)లో రెండు కేంద్రాలను కలిపి ఆరోగ్య శాఖకు చెందిన భవనంలో నిర్వహిస్తున్నారు. ఒక టీచర్ దీర్ఘకాలికంగా కేంద్రానికి రానందున రెండు కేంద్రాలు ఒక చోట నిర్వహిస్తున్నారు. ఇక్కడ స్వంత భవన నిర్మాణం పూర్తయినప్పటికి వంట గది నిర్మాణం కాలేదని స్వంత భవనంలోకి వెళ్లడం లేదు. దీంతో చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రుద్రూర్ మండలం రాయకూర్ క్యాంపులో, అంబం(ఆర్)లో టీచర్ పోస్టులు, వివిధ గ్రామాల్లో ఆరు ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయి. కేంద్రాల్లో సిబ్బంది కొరత వల్ల ఇన్‌చార్జిలతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సొంత భవనాలు నిర్మించి, ఖాళీలు భర్తీ చేయాలని చిన్నారుల తల్లితండ్రులు కోరుతున్నారు.

### భవనాలు మంజూరవుతున్నాయి

బోధన్ ప్రాజెక్టు పరిధిలోని బాన్సువాడ, బోధన్ నియోజక వర్గానికి 29 నూతన భవనాలు మంజూరయ్యాయి. అన్ని కేంద్రాలకు సొంత భవనాలు ఉండాలనే ఉద్దేశంతో విడతల వారీగా మంజూరు చేస్తున్నారు. మంజూరైన భవనాల నిర్మాణం కోసం స్థల సేకరణ చేస్తున్నాం.

– పద్మ, బోధన్ ప్రాజెక్టు సీడీపీవో

# సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు



దత్తాపూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు

డొంకేశ్వర్ : సాగునీటి కోసం డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామ రైతులు రోడ్డెక్కారు. ఎత్తిపోతల పథకం ఉన్నా నీటిని విడుదల చేయడం లేదని, అనధికారికంగా కొనసాగుతున్న చైర్మన్ వెంకట రమణ లిఫ్టుకు తాళం వేశాడని రైతులు ఆరోపిస్తూ రోడ్డుపై ధర్నా చేశారు. దత్తాపూర్ ఎత్తిపోతల కింద తొండాకూర్, మారంపల్లి గ్రామాలు కూడా ఆధార పడి ఉన్నాయని, మొత్తం 1,100 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. లిఫ్టుపై ఆధారపడి చాలా మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారని, ఇప్పుడు నీటిని విడుదల చేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆరోపించారు. రైతుల నుంచి డబ్బులు తీసుకున్న లిఫ్టు చైర్మన్ గ్రామంలోకి రావడం లేదని, ఆయనకు చైర్మన్‌గా కొనసాగే అర్హత లేదన్నారు.

వెంటనే కొత్త చైర్మన్‌కు ఎన్నిక నిర్వహించి పంటలకు సాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ చైర్మన్ సుంకరి రాజు రైతుల వద్దకు వచ్చి నీటి విడుదలకు హామీ ఇచ్చి ధర్నాను విరమింపజేశారు.

# హిందూ పండుగలపై చిన్న చూపు తగదు

- రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి విమర్శలు



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

ఆర్మూర్: హిందూ పండుగలతో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చినా ఏర్పాట్లు కల్పించడంలో మాత్రం చిన్న చూపు చూస్తోందని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఆర్మూర్ పట్టణ శివారులోని గూండ్ల చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి చేస్తున్న ఏర్పాట్లను, మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినాయక నిమజ్జనం, దుర్గామాత నిమజ్జనాలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా శాశ్వతంగా రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిమన్యు మాల్వియా, మున్సిపల్ కమిషనర్ రాజు, బీజేపీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, నాయకులు పెద్దోళ్ల భరత్, ఉదయ్ గౌడ్, యుగేందర్, వేణు, మామిడిపల్లి చిన్నా రెడ్డి తదితరులు ఉన్నారు.

# నిమజ్జనంలో అపశ్రుతులకు తావివ్వద్దు



ఆర్మూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్మూర్: వినాయక నిమజ్జనాల సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలో, నిమజ్జనం సమయంలో చెరువుల వద్ద అపశృతులు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువుపై వినాయక ప్రతిమల నిమజ్జనం కోసం చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ గురువారం పరిశీలించారు. నిమజ్జనం చేసే ప్రదేశంలోని వసతులను పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. పోలీస్, మున్సిపల్, ఆర్ అండ్ బీ, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్ తదితర శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవ్య, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు ఉన్నారు.

బోధన్‌టౌన్: బోధన్‌లో వినాయక శోభాయాత్ర సాగే రూట్‌ను సబ్ కలెక్టర్ వికాస్ మహతో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణతో కలిసి పరిశీలించారు. శోభాయాత్ర సాగే రూట్‌లో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ విఠల్, బల్దియా సిబ్బంది ఉన్నారు.

### మెండోరాలో టీఎల్‌ఎం మేళా

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. విద్యార్థులకు బోధనోపకరణల కోసం ఉపయోగించే ప్రదర్శనలు చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన టీచర్స్ లర్నింగ్ మెటీరియల్‌ను ఎంఈవో శ్రీనివాస్, ఎస్సై సుహాసిని పరిశీలించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం



డొంకేశ్వర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు లేని పేదల కల సాకారమయ్యేలా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమేశ్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసి పనులను ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి శేఖర్‌గౌడ్, హరిదాస్ పాల్గొన్నారు.

### ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపాలి



ఆర్మూర్‌టౌన్: రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మేకల గోవింద్ అన్నారు. గురువారం ఆర్మూర్ పట్టణంలోని ప్రాథమిక సహకార సంఘంలో రైతులకు ఆయిల్ పామ్ సాగు పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణంతో పాటు మండలంలోని ప్రాథమిక సహకార సంఘాలను తనిఖీ చేశారు. ఏడీఏ విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి హరికృష్ణ, సొసైటీ చైర్మన్ చిన్న ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులను ప్రోత్సహించాలి



ఆర్మూర్: వైకల్యంతో బాధపడుతున్న వారిని దివ్యాంగులుగా చూసి జాలి పడకుండా విశిష్ట ప్రతిభావంతులుగా గుర్తించి వారిని ప్రోత్సహించాలని సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం జిల్లా కోఆర్డినేటర్ పడకంటి శ్రీనివాస్‌రావు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఐఈఆర్పీలు కిషన్, సురేశ్‌తో మాట్లాడారు. కేంద్రంలో వారానికి రెండు సార్లు ఉచితంగా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను పరిశీలించి డాక్టర్ అరుణతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు.

### కోతుల బెడద నుంచి కాపాడాలి

నవీపేట: గ్రామాల్లో కోతులు, కుక్కల బెడద నుంచి కాపాడాలని సీపీఐ(ఎంఎల్) నాయకులు గురువారం ఎంపీడీవో నాగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాజేశ్వర్, ప్రభుచరణ్, రమేశ్, హనుమాండ్లు తదితరులు పాల్గొన్నారు.

### స్కూల్ బ్యాగుల పంపిణీ

రుద్రూర్: పొతంగల్ మండలం కొడిచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలోని నిరుపేద విద్యార్థులకు గురువారం కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుగుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు రాజు, వంశీ, నాయకులు సాయిలు, గంగాధర్, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన శిక్షణ అందించాలి



ఆర్మూర్: మహిళలు, యువతులకు విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా నాణ్యమైన శిక్షణ అందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. పెర్కిట్‌లో కొనసాగుతున్న దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో కలెక్టర్ అధ్యక్షతన గురువారం సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ కేంద్రం ద్వారా అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, పని తీరు గురించి సమావేశంలో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అన్ని కోర్సులలో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్‌లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కు మరమ్మతులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. అలాగే పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశారు. అనంతరం కలెక్టర్ తరగతి గదులను సందర్శించి, వివిధ కోర్సులలో శిక్షణ పొందుతున్న వారికి పలు సూచనలు చేశారు. ప్రాంగణం జిల్లా మేనేజర్ ఇందిర, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగురావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### రాణంపల్లిలో ఈత మొక్కలు ధ్వంసం

రుద్రూర్: మండలంలోని రాణంపల్లి శివారులో ఈత మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని గౌడ సంఘం సభ్యులు గురువారం తెలిపారు. తమ జీవనోపాధిని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్న వారిని అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిపోయిన గుడ్లు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు నిర్వాహకులు పురుగు పట్టిన గుడ్లు ఇస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ అవేశ్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

### బాధ్యతగా విద్యా బోధన చేపట్టాలి

మాక్లూర్: ఉపాధ్యాయులు బాధ్యతగా బోధన చేపట్టాలని డీఈవో అశోక్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన మాక్లూర్ ప్రభుత్వపాఠశాల హెచ్‌ఎం శ్రీహరి పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అనంతరం హెచ్‌ఎంను సన్మానించారు. ఉపాధ్యాయులు మెట్టు లక్ష్మీనారాయణ, సాయిలు పాల్గొన్నారు.

# పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

వర్ని: గణేశ్ ఉత్సవాలతో పాటు అన్ని పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. గురువారం వర్ని మండల కేంద్రంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. గణేశ్ ఉత్సవాలతో పాటు అన్ని రకాల పండుగలను కలసికట్టుగా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, విద్యుత్ తీగలతో జాగ్రత్త పాటించాలన్నారు. గణేశ్ మండపాలు నెలకొల్పే వారు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రుద్రూరు సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్, వర్ని ఏఎంసీ చైర్మన్ సురేశ్ బాబా పాల్గొన్నారు.

### సదస్సును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సుజాత సూర్యవంశీ, నాయకులు

బోధన్ : దివ్యాంగులు, చేయూత పెన్షనర్ల మహాగర్జన సభ నేపథ్యంలో బోధన్‌లో ఈ నెల 23న నిర్వహించే డివిజన్ స్థాయి సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ కోరారు. గురువారం పట్టణ కేంద్రంలోని రాకాసీపేట ప్రాంతంలో ఉన్న నీటి పారుదల శాఖ విశ్రాంతి భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పింఛన్ల పెంపుదల డిమాండ్‌తో సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో మహాగర్జన సభ తలపెట్టామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లసింగారి భూమయ్య, జిల్లా ఇన్‌చార్జి కొడాలి స్వామి, జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, నాయకులు తాడెం అబ్బయ్య, కృష్ణవేణి, యమునా, రొడ్డ ప్రవీణ్, వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రతినిధి సలీం తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థలకు నిధులు కేటాయించాలి




ధర్నా చేస్తున్న నాయకులు

పెర్కిట్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో శివాజీకి వినతిపత్రం అంజదేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ మండల సంయుక్త కార్యదర్శి కిషన్, నాయకులు నరేందర్, రాజన్న, గంగారాం, రమేశ్, శేఖర్, లింబాద్రి, శ్రీనివాస్, ఎండీ నజీర్, ఎం నిఖిల్, ఎండీ సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

### వరి పంట బోనస్ చెల్లించండి



ఆర్మూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రబీలో పండిన వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్‌ను వెంటనే చెల్లించాలని భారతీయ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్మూర్ పట్టణ శాఖ నాయకులు సబ్ కలెక్టర్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. కిసాన్ మోర్చా నాయకులు ఉన్నారు.

## ఎన్నిక..

వేల్పూర్ గౌడ సంఘ నూతన కార్యవర్గం..



వేల్పూర్: మండల కేంద్రంలో గౌడ సంఘాన్ని నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లగ్గాల నర్సాగౌడ్, ఉపాధ్యక్షుడిగా అబ్బగోని ప్రతాప్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పడాల రాజేశ్వర్‌గౌడ్, కోశాధికారిగా బొంబాయి నర్సాగౌడ్, రైటర్‌గా నాయిని ఆదిత్యగౌడ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మల్లాగౌడ్, దేవేందర్‌గౌడ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి

ఆర్మూర్: ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించిన అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, బీవీఎం రాష్ట్ర అధ్యక్షుడు బట్టు శ్రీధర్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు అఖిల్, విద్యార్థి సంఘాల నాయకులు నిఖిల్, దుర్గా ప్రసాద్, సిద్ధు, మణి, భాను, రిశ్వంత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

బోధన్‌టౌన్: బోధన్ మున్సిపల్ పరిధిలోని 38 వార్డులో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై పట్టింపు లేకుండా పోయిందని, కాలనీల్లోని మురికి కాలువలు శుభ్రం చేయడం లేదని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి మల్లేశ్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కమిషనర్ జాదవ్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మండల కార్యదర్శి పడాల శంకర్, సీతారాం, నాగమణి, నాగేశ్వర్‌రావు, పోశెట్టి, నగేశ్ తదితరులు ఉన్నారు.

### ఎడపల్లిలో జాతీయ సీనియర్ సిటిజన్స్ డే

బోధన్: వయోవృద్ధులైన కన్న తల్లిదండ్రులను కొడుకులు, కూతుర్లు గౌరవంగా ఆదరించి సంరక్షణ బాధ్యతలు చూసుకోవాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డివిజన్, మండల ప్రతినిధులు అన్నారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో జాతీయ సీనియర్ సిటిజన్స్ డేను నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తాద్రి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్, మండల అధ్యక్షుడు పోలా మల్కారెడ్డి, డివిజన్ ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, విఠల్‌రావు, ముత్తెన్న, సభ్యులు పాల్గొన్నారు.

### పోలీసుల అనుమతి తప్పని సరి

బోధన్‌టౌన్: గణేశ్ పండుగ సందర్భంగా పట్టణంలోని కాలనీల్లో ఏర్పాటు చేసే మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని మహాలక్ష్మి మందిరం ఆవరణలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. పట్టణ సీఐ వెంకట నారాయణ, మున్సిపల్ మేనేజర్ సుధాకర్, సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాసుల శ్రీనివాస్, అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

### నవీపేటలో ఆస్పత్రి ప్రారంభం

నవీపేట: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైష్ణవి ఆస్పత్రిని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం బాసర అన్నసత్రం అధ్యక్షుడు రాపోలు సుధాకర్, డిచ్‌పల్లి పోలీస్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సత్యనారాయణ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

### సంతలో మౌలిక వసతులు కల్పించాలి

నవీపేట: నవీపేట మేజర్ జీపీ పరిధిలోని సంతలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సంత ప్రాంగణాన్ని గురువారం సందర్శించారు. ఆదాయం తెచ్చిపెడుతున్న సంతపై చిన్నచూపు తగదని అన్నారు.